క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి మాస పౌర్ణమి పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో గల అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 35వ మాస పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయ నాంచారులతో మలయప్ప స్వామిని గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. పురప్పాడులో భాగంగా శ్రీవారి ఆలయ శిఖర దర్శన మహద్భాగ్యం భక్తులకు కలిగింది. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా శ్రీవారి సేవా సమాజం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



నకరికల్లు: గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకొని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మణికంఠ సూచించారు. మండలంలోని త్రిపురాపురం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలుచేసి, మందులు పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకొని, సూచనల మేరకు మందులు వాడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సైడ్ కాల్వలకు శంకుస్థాపన




సత్తెనపల్లి: దీపాలదిన్నెపాలెం, నందిగామ గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించారు. నందిగామలో రూ.9 లక్షలతో రెండు సైడ్ కాల్వలు, దీపాలదిన్నెపాలెంలో రూ. 11.50 లక్షలతో రెండు సైడ్ కాల్వల నిర్మాణానికి అధికారులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్‌డీ అన్నపరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఏపీఓ పొత్తూరి వెంకటనారాయణ, పంచాయతీ రాజ్ ఏఈ సింగ్, సర్పంచ్‌లు బలిజేపల్లి రమాదేవి, వాసిరెడ్డి ఇందిరా, సచివాయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



అచ్చంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి వి.హనుమంతరావు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఓపీ వివరాలపై విచారించారు. అన్ని వ్యాధులు మందులు, వ్యాక్సిన్లు ఉన్నాయో లేవో తెలుసుకున్నారు. సిబ్బంది కొరత ఎమైనా ఉంటే చెప్పాలని కోరారు. వైద్యశాలలో నలుగురు వైద్యులకు గాను, ముగ్గురే ఉండటంతో మరొకరు ఎందుకు రాలేదని అడిగారు. డాక్టర్ రాజేష్ డెప్యుటేషన్‌పై సీఎం కార్యాలయానికి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. రోగులను పలకరించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంకట్రావు, ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు డాక్టర్ ఇన్నారావు, డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, గోకులాలకు శంకుస్థాపనలు



రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెం, అనుపాలెం, కోటనెమలిపురి, నెమలిపురి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, గోకులాలు ఏర్పాటు చేసుకునేందుకు శంకుస్థాపనలు చేసినట్లు ఎంపీడీవో సత్యనారాయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, టీడీపీ మండల కన్వీనర్ పల్లపాటి పెద్దిరాజు, జనసేన మండల కన్వీనర్ తోట నర్సయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ.. పర్యవేక్షణ ఏదీ?

- ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్ల కొరత
- జిల్లా వ్యాప్తంగా 12 పోస్టులు ఖాళీ
- ఉన్న వారిపై పని భారంతో సతమతం
- వివిధ కార్యక్రమాల అమలుకు ఆటంకం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఐసీడీఎస్ కార్యాలయం

సత్తెనపల్లి: ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ స్కీమ్ (ఐసీడీఎస్) ప్రాజెక్టుల్లో కీలకమైన సూపర్‌వైజర్ల కొరత నెలకొంది. అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ అంతంత మాత్రంగా సాగుతోంది. జిల్లాలో నరసరావుపేట, వినుకొండ, నాదెండ్ల, ఈపూరు, సత్తెనపల్లి, క్రోసూరు, గురజాల, మాచర్ల, పిడుగురాళ్ల కేంద్రాలుగా 9 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 2,010 అంగన్‌వాడీ కేంద్రాలు, 21 మినీ అంగన్ వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల పర్యవేక్షణకు 83 మంది సూపర్‌వైజర్లు ఉండాలి. ప్రస్తుతం 71 మంది పని చేస్తున్నారు. 12 సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ ఆశించిన స్థాయిలో జరగడం లేదని విమర్శలున్నాయి.

పని భారంతో సతమతం

జిల్లా వ్యాప్తంగా 12 సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో.. మిగిలిన సూపర్ వైజర్లపై ఆ అదనపు పని భారం పడింది. ఒక్కో సెక్టార్‌లో సుమారు 40 నుంచి 50 వరకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉంటాయి. ఇలా అదనపు సెక్టార్ లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఒక సూపర్‌వైజర్ పర్యవేక్షించడం కష్టతరంగా మారింది.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు వయసు ఉన్న చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, ప్రీ ప్రైమరీ విద్య, ఇమ్యునైజేషన్, చిన్నారుల పోషణ, ఆరోగ్యం, పిల్లల ఎదుగుదల, విటమిన్ లోపం నివారించడం తదితర కార్యక్రమాలన్నీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే అమలు కావాల్సి ఉంది. ఈ కార్యక్రమాలు 100 శాతం విజయ వంతం కావాలంటే వీటిని పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లు పూర్తిస్థాయిలో ఉంటేనే సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించడం లేదని పలువురు వాపోతున్నారు. సర్దుబాటు పేరుతో అదనపు భారాన్ని మోపుతున్నారు. సిబ్బందిపై అదనపు భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బందులు కలకుండా ఉండేందుకు ప్రభుత్వం తక్షణమే సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా సమాచారం ఇలా

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	9
అంగన్‌వాడీ కేంద్రాలు	2,010
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	21
మొత్తం సూపర్ వైజర్ పోస్టులు	83
ప్రస్తుతం ఉన్న సూపర్ వైజర్లు	71
ఖాళీగా ఉన్న పోస్టులు	12
గర్భిణులు	12,438
బాలింతలు	10,506
3 ఏళ్లలోపు చిన్నారులు	65,020
6 ఏళ్లలోపు చిన్నారులు	47,527

క్రమబద్ధీకరించండి


రోడ్డు మార్జిన్స్‌లో తోపుడు బండ్ల వ్యాపారులు

అచ్చంపేట: అచ్చంపేటలో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. ఇళ్ల ముందు మెరకలు, ఆక్రమణలు, రోడ్డు మార్జిన్‌లో తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారితో రోడ్డు కుదించుకుపోతోంది. దీనికితోడు ఆర్టీసీ బస్సులు, ఇసుక లారీలు, ఆటోలు సైతం రోడ్డుపైనే నిలుపుకుంటున్నారు. సత్తెనపల్లి రోడ్డులో ఆంనేయస్వామి విగ్రహం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు.. అమరావతి రోడ్డులో ఆంజనేయస్వామి విగ్రహం నుంచి కొఠారు సెంటర్ వరకు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. రోడ్డుపైనే ఆటోలు, ఇసుక లారీలు ఆపుకునే వారు ఎక్కువయ్యారు. దీని వల్ల పాదచారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పిల్లలు రోడ్డుపైకి వస్తుంటే.. భయమేస్తుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు పాత బ్యాంకు సెంటర్ నుంచి ఆంజనేయ స్వామి విగ్రహం వరకు రద్దీ ఎక్కువగా ఉంటుంది. 23 గ్రామాల కేంద్రమైన అచ్చంపేటకు ప్రతి నిత్యం రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్ కార్యాలయాలకు గ్రామస్తులు ఏదో ఒక పనిపై వచ్చిపోతుంటారు. అచ్చంపేటలోనే 4 బ్యాంకులు ఉండటంతో డ్వాక్రా మహిళలు, ఖాతాదారులు వస్తుంటారు. బ్యాంకుల వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో వినియోగదారులు రోడ్డుపైనే తమ వాహనాలు నిలిపివేస్తున్నారు. దీనికి తోడు ఆర్టీసీ బస్సులు కూడా సమయాలను పాటించకపోవడంతో ప్రయాణికులు గంటల సేపు రోడ్డుపై వేచి ఉండాల్సి వస్తోంది. ఉదయం అల్పాహారం తీసుకోవాలన్నా.. రోడ్డుపై బస్సులు నిలుపుకోవాల్సి వస్తోందని డ్రైవర్లు చెబుతున్నారు. గతంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీసు శాఖ అధికారులు ఆక్రమణలను తొలగించినా అది మూన్నాళ్ల ముచ్చటే అయ్యింది. తిరిగి యథావిధిగా పరిస్థితి నెలకొంది. సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినా.. రెండు మూడు రోజులు కంటి తుడుపు చర్యగా ఒక కానిస్టేబుల్‌ను ఉంచుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూడటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా అచ్చంపేట మెయిన్ రోడ్డు, అమరావతి రోడ్లపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన తప్పనిసరి

జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి


శిక్షణలో మాట్లాడుతున్న శివకుమారి

సత్తెనపల్లి: పత్తి పంటలో గులాబి రంగు కాయ తొలిచే పురుగు, రసం పీల్చే పురుగు నివారణ చర్యలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డి.శివకుమారి అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూర పాడు, ముప్పాళ్ళ మండలాల్లో పని చేస్తున్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు, బహుళ ప్రయోజన విస్తరణ అధికారులకు సబ్ డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ శిక్షణలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. సీఏలపీఎస్ఏస్ మొబైల్‌లో యాప్ డి.నందు ప్రతి గ్రామ స్థాయి అధికారి పంట వివిధ దశలు, ఆశించే తెగుళ్లు, చీడపీడలు ఫొటోలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. కంది, వరి పంటల్లో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎం. ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామస్థాయి అధికారి ప్రతి ఒక్కరూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న ప్రతి ఒక్క అంశం కూడా గ్రామస్థాయిలో రైతులకు వారు పండించే పంటలకు సూచనలు ద్వారా చేరవేయాలని సూచించారు. సత్తెనపల్లి, పెదకూరపాడు, ముప్పాళ్ల మండల వ్యవసాయ అధికారులు ఎస్.శ్రీధర్ రెడ్డి, శాంతి, అరుణ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస చక్రవర్తి

సత్తెనపల్లి: ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ గ్రామ సభల ద్వారా రైతులకు మేలు జరుగుతుందని సత్తెనపల్లి తహసీల్దార్ కె.శ్రీనివాస చక్రవర్తి అన్నారు. కంటెపూడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. తహసీల్దార్ శ్రీనివాసచక్రవర్తి మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారమే రెవెన్యూ గ్రామ సభల లక్ష్యమన్నారు. ప్రతి అర్జీకి పరిష్కారం మార్గాన్ని చూపిస్తామన్నారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై గ్రామంలోని రైతుల నుంచి వచ్చిన 30 అర్జీలు స్వీకరించారు. మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు, గ్రామ సర్వేయర్ నాగరాజు, వీఆర్వో ఎం.నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలి

సత్తెనపల్లి: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అర్హులైన న్యాయవాదులు, గుమస్తాలు వారి కుటుంబ సభ్యులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు, న్యాయవాది మద్దినేని వెంకట చలపతిరావు అన్నారు. పట్టణంలోని న్యాయవాదులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. నవంబర్ 6 లోపు ఓటర్ల నమోదు పూర్తి చేయాల్సి ఉందన్నారు. చివరలో ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తే ప్రమాదం లేకపోలేదన్నారు. ఈ నెల 25 లోపు అన్నీ వివరాలతో కూడిన పత్రాలు అందజేస్తే ఆన్‌లైన్‌లో ఓట్లు నమోదు చేయిస్తామన్నారు. పూర్తి వివరాలకు 92464 65566 సంప్రదించాలన్నారు.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ వరప్రసాద్


ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వరప్రసాద్

పెదకూరపాడు: పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ ఎన్వీవీఎస్ వరప్రసాద్ (బుజ్జి) అన్నారు. పెదకూరపాడు కచేరి సెంటర్‌లో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబర్ 2021కి డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదుకు అర్హులేనన్నారు. వారం రోజులుగా పెదకూరపాడులో పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఓట్లు నమోదు చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రత్తిపాటి సురేష్ తన ఓటును నమోదు చేసుకున్నారు. ఓటు ఎంతో విలువైనదని ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు, జన చైతన్య సమితి నిర్వాహకులు వెలితోటి అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

39 మంది ఉద్యోగాలకు ఎంపిక

సత్తెనపల్లి: ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 39 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాకు మూడు కంపెనీలు హాజరుకాగా 84 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ బాధ్యులు వీసీహెచ్ రామాంజనేయులు, సత్తెనపల్లి స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ ఇందూరి రామకృష్ణారెడ్డి, ఎం వీరాంజనేయులు, కంపెనీ హెచ్ ఆర్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పల్లె పండుగ'



ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం, నార్నెపాడు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ ఇరుకుపాలెం గ్రామంలో రూ.13 లక్షలతో అంతర్గత సీసీ డ్రెయిన్‌లు, నార్నెపాడులో రూ.29.5 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నార్నెపాడు గ్రామ సర్పంచ్ యలమంద, ఎంపీడీవో పీజే విలియమ్స్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఏడుకొండలు, పీఆర్ ఏఈ నాగేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులానికి శంకుస్థాపన

బెల్లంకొండ: మండలంలోని ఎమ్మాజీగూడెం, బెల్లంకొండ గ్రామాల్లో శుక్రవారం 'పల్లె పండుగ' వారోత్సవాలు నిర్వహించారు. మినీ గోకులాల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఏపీవో కోటమ్మ, పీఆర్ ఏఈ శేషప్పయ్య, టీడీపీ నాయకులు పీఎస్కే మస్తాన్ షరీఫ్, సముద్రం, రసూల్, వెంకటరామిరెడ్డి, తమ్మిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

క్రోసూరు, దొడ్లేరులో పల్లె పండుగ

క్రోసూరు: క్రోసూరు, దొడ్లేరు గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశుపోషకుల కోసం పశువుల షెడ్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు, దొడ్లేరు పంచాయతీ సెక్రటరీలు ఆదినారాయణ, వెంకయ్య, ఏపీవో వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల పశుపోషకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతుల ఆసక్తి

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి


నార్నెపాడులో సాగు చేసే పొలాన్ని పరిశీలిస్తున్న పీడీ అమలకుమారి

నార్నెపాడు(ముప్పాళ్ళ): రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారని, ఈ విధానం ద్వారా తక్కువ పెట్టుబడితో పలు రకాల పంటలు పండించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. వరిలో ఏ గ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్‌లను ప్రయోగాత్మకంగా సాగు చేసే పొలాన్ని పరిశీలించారు. ఎకరం పొలంలో 0.90 సెంట్ల భూమిలో వరి, పది సెంట్లు భూమిలో 21 రకాల పంటలను సాగు చేశారు. అందులో కూరగాయలు, తీగజాతి, ఆకు కూరలు, దుంపజాతి మొక్కలు, చెట్లను సాగు చేశారు. వరి గట్లపై కూడా పలు రకాల మొక్కలు, ఆకు కూరలు, పండ్ల మొక్కలను నాటడం వల్ల నేలలోపల జీవవైవిధ్యాన్ని పెంచుతుందన్నారు. పంటలు ఆరోగ్యంగా ఉంటూ అధిక దిగుబడి వస్తుందన్నారు. మరో రైతు కొర్రపాటి సౌజన్య మిరప పంటలో వినూత్న పద్ధతిని అనుసరిస్తూ సాగు చేసిన పొలాన్ని పరిశీలించారు. మిరప మొక్కల మధ్య ముల్లంగి, బీట్‌రూట్, ఉల్లి, బంతి పూలు నాటారు. ఈ విధానం వల్ల మిరపలో వచ్చే తామర పురుగు, ఇతర పురుగులు ఆశించవని తెలిపారు. ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ యలమంద, డీపీపీ భవానిరాజ్, మెంటర్ వేమూరి రజిని, మాస్టర్ ట్రైనర్ మధుబాబు, పూజ, సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాంతాల పరిశీలన


పరిశీలిస్తున్న సీఐ సురేష్, దాతలు

పెదకూరపాడు: పెదకూరపాడులో సీసీ కెమెరాల ఏర్పాటుకు పలు ప్రాంతాలను శుక్రవారం జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్వీవీఎస్ వరప్రసాద్, క్రోసూరు సీఐ పి.సురేష్, అత్తోట మురళి ముకుంద రాయుడు, ట్రస్ట్ ప్రతినిధులు ఎస్.లక్ష్మీనారాయణ, శంకరు పరిశీలించారు. కచేరి సెంటర్, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్, అంబేడ్కర్ సెంటర్, ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, సాయిబాబా గుడి, పంచాయతీ కార్యాలయం తదితర ప్రాంతాలను సందర్శించారు. సుమారు 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ వరప్రసాద్ సూచనలతో హైదరాబాద్ జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ అత్తోట మురళి ముక్కుంద్ సహకారంతో సీసీ కెమెరాలు త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు ఉన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెదకూరపాడు: మండలంలోని 75 తాళ్లూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయునట్లు ఏఈ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

ఇంటిలో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ సురేష్

నకరికల్లు: మండలంలోని చీమలమర్రి గ్రామంలో దుండగులు ఎవరూ లేని ఇంట్లోకి ప్రవేశించి, చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ చల్లా సురేష్ వివరాల మేరకు.. చీమలమర్రి గ్రామానికి చెందిన గడ్డం శివరామకృష్ణయ్య వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం వేరే ఊరికి వెళ్లారు. శుక్రవారం శివరామకృష్ణయ్య ఇంటి తలుపులు తీసి ఉన్నట్లు గుర్తించిన ఇరుగుపొరుగు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చల్లా సురేష్ ఇంటిని పరిశీలించారు. ప్రధానద్వారం నుంచి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు 72 గ్రాముల బంగారు వస్తువు, కొన్ని వెండి వస్తువులు, రూ.40వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సామాజిక మందిరం.. అసాంఘికం


మద్యం సీసాలు


చిట్టడివిని తలపించేలా మొక్కలు

సత్తెనపల్లి: పట్టణంలోని నూతన సుగాలి కాలనీలో నిర్మాణ దశలో ఉన్న గిరిజన సామాజిక మందిరం మందు బాబులకు అడ్డాగా మారింది. గతంలో భవన నిర్మాణం కోసం పురపాలక సంఘం నిధులు రూ.4 లక్షలు మంజూరు చేయడంతో స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు ద్వారా రూ. 50 లక్షలు మంజూరు కావటంతో గిరిజన సామాజిక మందిరం నిర్మాణానికి మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు శంకుస్థాపన చేశారు. 2019 ఎన్నికల కోడ్ రావడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొంత నిధులు కేటాయించి, పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. ప్రస్తుతం భవనం పాడుబడినట్లుగా దర్శనమిస్తోంది. భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మద్యం ప్రియులు పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం సేవిస్తూ సీసాలు అక్కడే పడేస్తున్నారు. కొంతమంది జూదరులు పేకాట శిబిరాలు నడుపుతున్నారు. గిరిజన సామాజిక మందిరం ప్రాంగణంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిట్టడివిని తలపించేలా ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి, గిరిజన సామాజిక మందిరం నిర్మాణం పూర్తి చేసి వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు తాపీ మేస్త్రి మృతి


చేకూరి రామకృష్ణ మృతదేహం

సత్తెనపల్లి: తాపీ మేస్త్రీ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్ నగర్‌లో శుక్రవారం జరిగింది. మండలంలోని బట్లూరు గ్రామానికి చెందిన చేకూరి రామకృష్ణ (44) తన సోదరుడైన కొండ మేస్త్రి ముఠాలో తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. పట్టణంలోని రఘురామ్ నగర్ లో యామిని సుబ్బారావు భవన నిర్మాణానికి పరంజా వేసుకొని ప్లాస్టింగ్ పనులు చేస్తుండగా పరంజా విరిగి లిఫ్ట్ గుంటలో పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని హుటాహుటిన పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు. మృతునికి భార్య అంజలి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త మృతి చెందడంతో భార్య అంజలి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముప్పాళ్ళ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన నంబూరి నరేష్(35) ఈ నెల 1న సత్తెనపల్లి నుంచి దూళిపాళ్ళ మీదుగా ఇంటికి బైక్‌పై వస్తూ గ్రామ సమీపంలో గేదెను తప్పించే క్రమంలో అదుపు తప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన నరేష్‌ను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రవేటు వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. భార్య లక్ష్మీతిరుపతమ్మ ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు పుల్లంశెట్టి సుబ్బయ్య(పాతచిత్రం)

నకరికల్లు: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై శిశుమందిర్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్ఐ చల్లా సురేష్ వివరాల మేరకు.. మండలంలోని నర్సింగపాడు గ్రామానికి చెందిన పుల్లంశెట్టి సుబ్బయ్య(48) స్థానిక శిశుమందిర్ సమీపం నుంచి నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో అడ్డరోడ్డు వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనదారుడూ గాయపడ్డాడు. క్షతగాత్రులను 108లో నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కాగా చికిత్స పొందుతున్న సుబ్బయ్య రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుక్రవారం తెలిపారు.